# 40. వదలని బూజు

మన "పుణ్యభూమి" నేలిన రాజుల మహారాజుల "రామరాజ్యం"లో యధార్థంగా జరిగిన వేలాది ఘట్టాలలో మచ్చుకు కొన్ని ఇంతవరకూ చెప్పుకున్నాం. ఈ గాథలన్నీ ఆయా రాజ్యాధినేతలు వ్యక్తిగత జీవితంలో కొన్ని భాగాలు మాత్రమే. ఈ విలాసాలకన్నింటికీ అయిన ఖర్చులు రైతాంగం నుండి గోళ్ళూడగొట్టి వసూలుచేసిన బాపతే. ఒక్క మాటలో సామాన్యుల రుధిరాన్ని పిండి విలాసాలకు ధారపోశారీ ప్రభువులంతా.

1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక క్రమక్రమంగా ఈ ప్రభువుల సంస్థానాలన్నీ భారతదేశంలోని రాష్ట్రాలుగానో, జిల్లాలుగానో విలీనమయిపోయాయ్. రాచరికాలు రద్ధయ్యాయి.

ఆ తరువాతేమయింది? రాజులూ మహారాజులూ ఏమయ్యారు?

రాచరికాలు రద్దయినా వారి హోదాలు, గౌరవాలు, ఆస్తిపాస్తులు, మహాభవనాలు, వేలాది ఎకరాల భూఖండాలు వారికే వదలివేయబడినాయ్. కొందరు రాజప్రముఖులుగా కొత్త అవతారాలెత్తితే మరికొందరు రాజకీయాల్లో వేలుపెట్టి ప్రభుత్వంపై పెత్తనమే సాధించగలిగారు. వేలు, లక్షల రూపాయల రాజభరణాలు దక్కించుకోగలిగారు.

కచ్ మహారాజా, నుండి రాజులు విదేశాలలో భారతరాయబారులుగా నియమితులయ్యారు. జబ్బుల్ మహారాజా దిగ్విజయచంద్ర, అలీ రాజపూర్ మహారాజా ఠాకూర్ సాహెబ్‌లు విదేశాంగ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవులలంకరించారు. బికనీర్ మహారాజా కర్ణిసింగ్, దున్‌గార్‌పూర్

మహారాజా లక్ష్మణసింగ్‌లు పార్లమెంటుకు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయి కూర్చున్నారు. ఘూర్వాల్ రాజమాత మహారాణి కమలేందుమతి, పాటియాలా మహారాణి మొహిందర్‌కౌర్‌లు రాజ్యసభకు ఎన్నికయారు.

పాట్నా మహారాజా ఆర్. ఎన్. సింగ్‌దేవ్ తర్వాతికాలంలో ఒరిస్సా ముఖమంత్రి అయాడు. మైసూర్, మద్రాసు రాష్ట్రాలకు గవర్నరుగా నియమితుడయాడు. బరోడా మహారాజా ఫతేసింగ్ గయక్వాడ్ గుజరాత్ ప్రభుత్వంలో మంత్రి అయాడు. జమ్ము కాశ్మీర్ మహారాజా కరణ్‌సింగ్ కేంద్ర ప్రభుత్నంలో కాబినెట్‌హోదా మంత్రి. నరసింగ్‌ఘర్ మహాదాజా భానుప్రకాష్‌సింగ్ పరిశ్రమాభివృద్ధి శాఖకు సీనియర్ ఉపమంత్రి.

రాజకీయరంగంలో వీరిప్రవేశం అలా ఉండగా అనేక మంది రాజులూ, యువరాజులూ భారతసైన్యంలో పెద్ద పెద్ద హోదాలలో అధికార సానాల్నలంకరించారు. రాజకుమారి అమృతకార్ తొలి భారతమంత్రివర్గంలో ఆరోగ్యశాఖా మంత్రిణి. నిన్న మొన్నటిదాకా మన రాజకీయ రంగంలో ప్రముఖంగా కనుపించిన మహారాణి గాయత్రీదేవి రాచకుటుంబాల మనిషే.

తొలిదశలో కొందరు మహారాజులు వేలాది ఎకరాల భూఖండాల్ని యంత్రసహాయంతో నడిచే వ్యవసాయ క్షేత్రాలుగా మార్చితే మరికొందరు కౌళ్ళకిచ్చిగానీ, అమ్మివేసిగానీ ఆ పరిశ్రమల్ని స్థాపించారు. అనేక మహారాజ భవనాలు ఫైవ్‌స్టార్ హోటళ్ళుగా వేషం మార్చుకున్నాయి.